# దేవతలు కొలువుదీరిన వేళ!

**జీవితం అంటేనే గజిబిజి గందరగోళం... ప్రతిమనిషినీ ఏదో ఒక సమస్య వెంటాడుతూనే ఉంటుంది. దాన్నుంచి బయట పడాలంటే మానసికోల్లాసం కావాలి. అందుకు చిత్రలేఖనాన్ని మించిన సాధనం మరొకటి లేదంటున్నారు ఆయుర్వేద వైద్యులు, చిత్రకారిణి అయిన గాయత్రీ దేవి.**



గిరిధారి..



గణనాథుడు



లక్ష్మీదేవి



చిన్నికృష్ణుడు

## ఆకట్టుకుంటున్న తంజావూరు చిత్రాలు



గాయత్రీ దేవి

గాయత్రీ దేవి కుంచె నుంచి జాలువారిన తంజావూరు చిత్రాల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంటోంది. బ్రీచ్‌కాండీ ప్రాంతం భులా భాయ్ దేశాయ్ రోడ్డులోని వల్లభ్‌జీ అపార్టుమెంట్స్‌లోగల బ్యాంకు ఆర్ట్ గ్యాలరీ (స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు)లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సంప్రదాయ తంజావూరు శైలిలో కనిపించే చిత్రాలతోపాటు కొన్ని ప్రత్యేక చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. మురళీకృష్ణుడు, వటపత్రశాయి, వెన్నముద్ద తింటున్న కృష్ణుడు, లక్ష్మీదేవి, నాట్యం చేస్తున్న గణపతి, తంజావూరు గణేషుడు, ఊయలూగే బాల గణపతి, దశావతారాలు, అష్టలక్ష్ములు, కాళీమాత, రుక్మిణీ కృష్ణుల అనురాగ సన్నివేశం తదితర చిత్రాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆమె తన కళను తనలోనే దాచుకోకుండా ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నారు. తంజావూరు శైలిలో 50 దేవుడి బొమ్మలను ఇంతవరకు గీశారు. 1996 నుంచి చెన్నైలో జరిగిన పలు సామూహిక ప్రదర్శనల్లో ఆమె తన చిత్రాలను ప్రదర్శించి మన్ననలు పొందారు. ముంబయికి వచ్చిన తర్వాత ఆమెకిది రెండో ప్రదర్శన. ఆంధ్ర సాహిత్య రంగంలో ఉషశ్రీ పేరుతో గుర్తింపు పొందిన పురాణపండ సూర్యప్రకాశదీక్షితులు కుమార్తె ఈ గాయత్రీదేవి. ఆయుర్వేద వైద్యవృత్తిలో 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. చెన్నైలో ఉన్నపుడు ఎ.వి.ఇలంగ్ వద్ద ఆధునిక చిత్రకళలో మెళకువలు నేర్చుకున్నారు. ఎలాంటి సమస్యనైనా మరచిపోవడానికి చిత్రకళను మించిన సాధనం మరొకటి లేదంటారు గాయత్రీదేవి. 'మనసును సకారాత్మక ఆలోచనలతో ఉంచేందుకు ఇది ఎంతో ఉపకరిస్తుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఒంటరితనంతో బాధ పడకుండా చేస్తుంది. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు లలితకళలు, సంగీతం, చిత్రలేఖనం ఎంతో ఉపకరిస్తాయి' అని ఆమె వివరించారు. ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ కొంత సమయాన్ని చిత్రలేఖనానికి కేటాయిస్తానని తెలిపారు. ఆదివారంతో ప్రదర్శన ముగుస్తుంది.

– న్యూస్‌టుడే, ముంబయి



గోపాలుడు

